# మనలో మాట

ఈ వారం నుంచి ప్రారంభించిన పెద్ద సీరియల్ వ్రాసిన శ్రీమతి యార్లగడ్డ సరోజినీదేవిగారు లోగడ కుమారి పిరపనేని సరోజినీ దేవిగా కూడా 'దేవత' 'సరళ' 'అనుపమ' 'విముక్తి' మొదలైన చాలా నవలలు ప్రచురించి పేర్గాంచారు. శ్రీమతి సరోజినీదేవి రచించిన 'గంగ' నవలనే వారి 'శ్రీవారు' శ్రీ యార్లగడ్డ రామచంద్ర రావుగారు 'మా వూరి గంగ' చలన చిత్రంగా తీశారు. ఇప్పుడు మరొక నవలను కూడా వారు సినిమాగా తీయనున్నారు. శ్రీమతి సరోజినీదేవి ఇటీవల "యుగసంధి" "భవ బంధాలు" "దూరపు కొండలు" మున్నగు చాలా నవలలు వ్రాశారు. ఆమెకు "రంగనాయకమ్మ నవలల పోకడ, కృష్ణ శాస్త్రిగారి గేయాలు, కొడవటిగంటి వారి వ్యాసాలు అంటే ఎంతో గౌరవం" అని తెలిపారు. 1943 లో కృష్ణాజిల్లా కైకలూరులో పుట్టారు. వాల్తేరు, హైదరాబాద్‌లలో చదువుకున్నారు. జర్నలిజంలో కూడా డిప్లొమా పొందారు. వీరికి నలుగురుసంతానం ★



# * ఉత్తరాలు *

## డాక్టర్ సలహాలు

21-5-76 సంచిక డాక్టరు సలహాలలో నేను వ్రాసిన సమాధానంలో (మొదటి ప్రశ్నకు) సెంట్రల్ కవున్సిల్ ఆఫ్ రిసెర్చి ఇన్ ఇండియన్ మెడిసిన్, మ్యాథిల్లీ అనే సంస్థద్వారా ఒక మందు శోభిమచ్చలకు వాడబడుతున్నదని పేర్కొన్నాను. ఆ సమాచారము 12-12-75 నాడు యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా అన్న వార్తా సంస్థద్వారా వచ్చి అన్ని ఆంగ్లభాషా పత్రికలలోను వెలువడినదని ఇందుమూలంగా తెలియచేయడ మైనది:

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు (మద్రాసు

## సీరియల్

'కనువిప్పు' సీరియల్ చాలా బాగుంది. విశాల పడుతున్న కష్టాలు చదువుతుంటే మాకు తెలియ కుండానే కళ్లవెంటనీరుకారినవి. ఈసీరియల్ వ్రాసిన రచయిత్రికి మా ధన్యవాదాలు. బొమ్మలు చాలా బాగున్నాయి. "కొలువు" కథ మా హృదయాలను కదిలించివేసింది ఈ పత్రిక ఇంకా ఇంకాఅభివృద్ధి కావాలని ఆశిస్తూ.

పి. జయచిత్ర (ముదినేపల్లి.

## కథలు

ఈ వారం 28-5-76 పత్రికలోని "కొనక్కరలేనిది" కథానిక డబ్బుతో ఏదైనా కొనుక్కొ గలమనుకునే ధనవంతులకు, పక్కా వ్యభిచారులకు కనువిప్పు అని చెప్పకతప్పదు. ఇంత మంచికథను వ్రాసిన రచయిత్రి అభినందనీయురాలు. పత్రికకు ఈ కథ వింతలందాన్ని ఇస్తోగా "కల్యాణ ఘడియ" పెళ్లికాని యువతులు సంఘంలో ఎదుర్కొనే సమస్యలను తెలియజేస్తూ మళ్లీ వారం శాంత సమస్య ఎలా తీరుతాయోనన్న ఉత్కంఠతను కలిగిస్తున్నది. శ్రీ సోమసుందర్‌గారి "రాలిన ముత్యాలు" చాల బాగున్నాయి.

కె. వాహిని (మిర్యాలగూడెం.)

## సామాన్యుని సణుగుడు

ఈ వారం 'అస్తమించని అక్కడు' అన్న సామాన్యుని సణుగుడు చదివి రాస్తూన్నఉత్తరంఇది.

మొదట్నుంచీ ఈ 'సణుగుళ్ల'లో బోలెడు సజెషన్లు దొర్లడం నేను గమనిస్తూన్నాను. వుదాహరణకి ఈ సారి "…. కాలవలున్న వూళ్ళు న్నాయి. రిజర్వాయర్‌లలో దాచి ఆ నీళ్లు కాలవల్లో వదిలేస్తే రావా (నీళ్ళు)…." వంటివి. అమూల్యమైన ఇలాంటి సజెషన్లు బావున్నాయని నాలాటి పాఠకులు ఉత్తరాలు రాయడం తప్ప. ఆయా బాధ్యతలను నిర్వహిస్తూ ఆ'పర్టికులర్' ఫీల్డులో వున్న అధికారుల దగ్గర్నించి జవాబులు రావెందుకు? నిజంగా ఇలాటి సూచనలు అమలు పరచ గలిగితే (సరైన పంథాలో) ఎంత బాగుంటుంది.

ఇది చూస్తుంటే తమిళనాడులో జరిగిన వో సంఘటన గుర్తుకొస్తుంది. నాకు. వో ప్రముఖ కార్టూనిస్టు (మదన్ అతని పేరనుకుంటాను) ఓ పత్రికలో ఒస్సుగీస్తూ ఆ బస్సుకి టాపు మీద ఎగ్జాస్ట్ పైపు గీసాడు. కేవలం నవ్వుకు నాల్సిన ఈ బొమ్మని చూసి నవ్వుకోడమే కాకుండా అదీ ఓ సజెషనుగా భావించి స్థానిక రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌వారు (పల్లవన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్) దాన్ని అమలులో పెట్టేందుకు సైతం ప్రయత్నాలు చేసారట.

శశిధర్, కార్టూనిస్టు (కాకినాడ.) ●

'పాట బాగుంది కదండీ?' అన్నాడు సీతాపతి

అవునని తలూపాను అయిష్టం గానే.

పాట నచ్చలేదని కాదు ఆ పాటని లోగడ చాలాసార్లు నేను విన్నాను. జిల్లాపరిషత్ పనిమీద శ్రీకాకుళం వెళ్లినపుడు ఆ సినిమా కూడా చూసాను. మంచి పాట. నాకిప్పుడు నచ్చనదల్లా ఈ సీతాపతితో మాట్లాడటమే.

పెద్ద చెల్లెల్ని దిగబెట్టడానికని వెళ్ళి, ఒరిస్సా నుండి వస్తున్నాను. ఒరిస్సా రాయఘడలో వుంటున్నారు వాళ్ళు. పాసింజరు బండి పార్వతీపురం చేరేసరికి మూడయింది మధ్యాహ్నం. పుట్టి పెరిగిన వూరు గనుక ఎవరయినా తెలిసినవాళ్ళు కనిపిస్తారేమోనని కిటికీలో తల పెట్టి, అనక్తిగా చూసాను.

సీతాపతి ఇద్దరు పిల్లలుతోనూ, భార్య తోనూ నేనున్న పెట్టెలోకే ఎక్కాడు. ఆనందమనిపించింది. వాడూ నేనూ పార్వతీపురంలోనే మల్టీ పర్పస్ హైస్కూల్లో హైయ్యరు సెకండరీ కోర్సు చదివేం. అప్పట్లోనాకు సీతాపతీ, రామం, గోవర్ధనం, భుజంగరావులు బెస్టు ఫ్రెండ్సు. మేము అయిదుగురం కలసి చేసిన అల్లరి అంతా యింతా కాదు. ఆ రోజులు ఎంత సరదాగా గడిచేయని!

డిగ్రీ చదువులకోసం, ఆ తరువాత ఉద్యోగాల వేటలోనూపడి, మేము విడిపోక తప్పింది కాదు. కాని బాల్యస్మృతులను నెమరవేసుకొనే మధుర క్షణాలలో మట్టుకు వాళ్ళు గుర్తుకు రాక తప్పదు. పనిభారంగా వున్నప్పుడు, మనసంతా చికాగ్గా వున్నప్పుడు – మనస్సుకి విశ్రాంతి కావాలనిపించినప్పుడు – మళ్ళీ ఆ రోజులు వస్తే ఎంత బాగున్ను! ఎంత కులాసాగా తిరొగొచ్చు – అనిపిస్తూ వుంటుంది.

ఆ భ్రమ కూడా తొలగిపోయింది.


సీతాపతి తీర్చేశాడు.

'నువ్వా! సీతాపతీ!' అన్నాను సంభ్రమంగా.

నల్లఫ్రేం కళ్లద్దాలు సవరించుకుని ఓ క్షణం తటపటాయించి 'మీరు - ఎంట చయనులు గదూ?' అన్నాడు.

నా నెత్తిమీద మంచునీళ్లు దిమ్మరించి నట్టు.

# స్నేహమేరా జీవితం.... పంతుల జోగారావు



'మీర'ని అంటాడేమిటి!

'వెధ'వ్వంటే 'వెధవ్వ'నుకునేవాళ్ళం కాదూ? ఆ చనువు ఏమయిపోయింది? ఆ ఆత్మీయత ఏ గంగలో కలిసిపోయింది? నాకు ఏం మాట్లాడాలో కూడా తోచలేదు. ఇప్పుడు వాడ్ని ఎలా సంబోధించాలి?

'అవును పతీ' అన్నాను మధ్యేమార్గం ఎంచుకుని, కొంచెం చనువు స్ఫురింపచేస్తూ.

'ఎక్కడ నుంచి వస్తున్నారు?'

నా సందేహం తీరిపోయింది. వాడింక నన్ను పూర్వంలా దగ్గరగా, చనువుగా, సరదాగా, స్వచ్ఛంగా 'ఒరేయ్ చేనులూ!' అని పిలవడు. నాతో మా చిన్ననాటి ముచ్చట్లు పంచుకోడు.

సభ్యతకోసం—తనగురించి, పిల్లలగురించి అడిగేను. పార్వతీపురంలో వాళ్ళ అన్నయ్య వుంటున్నాడట. ఈమధ్యే ట్రాన్స్ఫరయి వచ్చేడట అనకాపల్లి నుండి చూసిపోదామని ఫేమిలీతో ఇక్కడకి వచ్చేడట.

'స్నేహమేరా జీవితం ...
స్నేహమేరా శాశ్వతం ...
స్నేహమే మనకున్నదీ
స్నేహమే మన పెన్నిధీ ...' గుడ్డి బిచ్చగాడి గొంతు బ్రిడ్జిమీద వెళ్ళే రైలు శబ్దంతో కలిసిపోయి అదో మాదిరిగా వినిపిస్తోంది. స్నేహం! జీవితంలో నిజమైన స్నేహితుల్ని సంపాదించుకోగల్గటం ఎంత అదృష్టం! స్నేహమనే వరమే యీ మనుషులకు లేకపోతే వీళ్ళెలా బ్రతగ్గలరు? జీవితం ఎంత ఇరుగ్గా, ఎంత దిగులుగా, ఎంత ఒంటరిగా అయిపోతుంది? ఎంత అర్థ విహీనమయి పోతుంది!

కృష్ణశాస్త్రిగారి మాటలు గుర్తుకు వచ్చేయి...

"ఒంటరితనం లోపల లోపల గుబులు గుబులు మంటుంది. ఈ దారంట ఇందరు నడుస్తున్నారు. ఒక్కరైనా లోనికి రారే! పోనీ స్ఫుటంగా అడుగుచిన్నెలయినా నాకోసం వదలరే అని ఏడుపు వస్తుంది. ఇలాగ తపించుకు పోతాను ... సావాసం కోసం ఈ తపన; ప్రేమకోసం ఈ ఏడుపు!..."

కాలం వేగానికి తట్టుకోలేక జీవితం అశాంతిగా, ఆదరా బాదరాగా, తీరుబాటులేనితనంగా పరిణమించింది.

ఆఫీసులో, వీధిలో, క్లబ్బులో నవ్వులు తగిలించుకున్న మొహాలు తిలక్ అన్నట్లు — అంతా అపోరకమయిన నాగరకతారణ్యపు వెగటు వాసన.

పందరూపాయలు పర్దటంతోనో, విందుకు పిలవటంతోనో ఈ స్నేహాలు సరిపుచ్చుకుంటున్నాయి. సాయంత్రమయేసరికి చీట్లపేకకి అరడజను మంది స్నేహితులు తయారు. వీళ్ళంతా నిజమయిన స్నేహితులేనా? కాని తప్పదు. అది తప్ప వేరే వ్యాపకం కూడా కనిపించటంలేదు. మనసు విప్పి మాట్లాడుకోవటానికి ఏదీ ఒక నిండు గుండె? పేకాట మానేస్తానంటే వీళ్ళు మళ్ళీ నాముఖం చూస్తారా! నాచుట్టూ తిరుగుతూ, నాతో తమ కుటుంబ విషయాలు చెప్పుకునే రాఘవరావు కూడా ఎంత ప్రయత్నించినా నా మనసుకి దగ్గరగా రాలేకపోయాడు. స్నేహం చెయ్యలేక పోవటంలో నాలోపంకూడా లేదుకదా అనిపించి నన్నునేను విమర్శించుకునే వాడ్నికూడా! రాఘవరావు నా అనుమానాన్ని తీర్చేశాడు — అత్తెసరు మార్కులతో బి. కాం పాసయిన తన తమ్ముడికి మా కంపెనీలో నేను ఉద్యోగం చూపించలేక పోయినప్పుడు! నన్ను కలవటం మానేశాడు రాఘవరావు. నాకందుకు విచారం లేదు.

సరిగ్గా ఇలాంటి సమయాలలోనే హైస్కూలు జీవితం గుర్తొస్తూవుంటుంది 'ఒరే' అని పిల్చుకుంటూ 'వెధవా' అని కసురుకుంటూ ఒక్క క్షణం విడిచిపెట్టి తిరిగితే ఏం తరిగిపోతుందో నన్న భయంతో— ఆ రోజులు ఎంత సరదాగా గడిచిపోయేవని!

పగలంతా స్కూలులో కలిసేవున్నా — సాయంత్రమయేసరికి రైలుస్టేషను అవతల ఏటి దిబ్బలమీదికి షికారు వెళ్ళేవాళ్ళం. ఏ రోజయినా మాలో ఏ ఒక్కడు రాకపోయినా తెగ బాధపడిపోయేవాళ్ళం. ఒకరు లేకపోతే ఒకరు బ్రతకలేమనిపించేది. ఎన్ని కబుర్లు? ఎన్ని సరదాలు? వాటికి తరగటం అన్న ప్రశ్నే లేదు! వేసవి రోజుల్లో గోవర్ధనం వాళ్ళ మేడ

మీద చాపలూ, బొంతలూ పరచుకుని పడుకుని రాత్రి వెన్నెల్లో తెల్లవారేవరకూ కబుర్లు మీద కబుర్లు చెప్పుకుంటూ గడిపేవాళ్లం. సినిమాలకు వెళ్ళినప్పుడూ అంతే! అందరం కలిసివెళ్తే ఎంత గర్వంగా వుండేది? సినిమా చూసి వచ్చేక అభినయాల్తో సహా ఆ కబుర్లు ఒక వారం వరకూ తరిగేవి కావు...

కొంచెం పెరిగి, సెవెన్త్ ఫారంలోకి వచ్చేక కూడా మా అల్లరి తగ్గలేదు. చదువుల్లో కూడా మాదే ఫస్టు! పరీక్ష ఫలితాలు తెలిసాక — అందరం కలిసి విశాఖపట్నంలోనే కాలేజీలో చేరుదామనీ—ఒకే రూం తీసుకుని వుందామనీ—ఎన్నిసార్లు మేం అనుకోలేదు! అవన్నీ జరిగే విషయాలు కావని మాకు తెలిసిరావటానికి ఎన్నో రోజులు పట్టలేదు.

విడిపోయాం. గోవర్ధనం కాకినాడకీ — రామం హైదరాబాదులో వాళ్ళ అన్నయ్య దగ్గరికీ—భుజంగం, సీతాపతి అనకాపల్లికీ— నేను మిగిలిపోయేను. బొబ్బిలిలో బి. కాం.లో చేరగలిగాను. అక్కడ చదివేటే రోజూ పార్వతీపురంనుంచి బసలో కేరియరు వస్తుంది. అదనంగా కావలసిన ఖర్చు కొంతలో కొంత

# స్నేహమేరా జీవితం....

యినా తగ్గుతుందికదా అన్నారు నాన్నగారు- ఏమనగలను నేను మాత్రం?

విడిపోతున్న రోజున — దాదాపు అందరి కళ్లల్లోనూ నీళ్ళు తిరిగాయి. ఒక చక్కా—మాలాంటి స్నేహితులు ఎక్కడయినా వుంటారా అని కూడా గర్వపడ్డాం. ఒకరినొకరు మరచి పోకూడదనీ—వారానికి రెండేసయినా ఉత్తరాలు వ్రాసుకుంటూ వుండాలనీ ఎన్నో ప్రమాణాలు చేసుకున్నాం.


డిగ్రీలు పుచ్చుకునేవరకూ— జీవిత ప్రవాహపు వురవడి ఎలాటిదో తెలిసిరాలేదు. మొదట్లో బాగానే ఉత్తరాలు వ్రాసుకునేవాళ్ళం. మాలో ఉద్యోగాలు దొరికే కముందుగా భుజంగరావు పెళ్లి అయింది. అంతా వెళ్ళాం, సీతాపతి తప్ప. ఎందుకో రాలేకపోయేడు. తరువాత సీతాపతిదీ, గోవర్ధనానిదీ జరిగాయి. నేనూ, రామం — యింకా బ్రహ్మచారులుగానే మిగిలిపోయేం — క్రిందామీదా, పెళ్లికి ఎదిగిన ఆడపిల్లలుండటంచేత—

రానురాను మా మధ్య ఉత్తరాలు కూడా తగ్గిపోయేయి. తీరికలేక కొంతా — సరైన అడ్రసులు దొరక్క కొంతా జవాబులు సరిగా రాకపోవటంచేత కొంతా — దిగులనిపిస్తూ వుంటుంది. అలాంటిది ఇప్పుడిలా సీతాపతి కనిపించేసరికి ఎంత ఆనందమనిపించింది! అతనితో చిన్ననాటి ముచ్చట్లు కలబోసి చెప్పుకుని తనివితీరా నవ్వుకోవాలని మనసు ఎంత ఆరాటపడింది!

నా ఆనందాన్నంతా చప్పగా చేసేసాడు సీతాపతి—ఒక్క సంబోధనతో ...

రైలు ఏదో స్టేషనులో ఆగింది. తొంగి చూసేను. సీతానగరం. పాసింజరు బళ్ళకు యిది వాటరింగు స్టేషను. ఇరవై నిమిషాల వరకూ బండిని ఇక్కడ డిటెయిన్ చేస్తారు. సరిగ్గా సాయంత్రం కాఫీల సమయం కావటం వల్ల ఏమంత పెద్ద స్టేషను కాకపోయినా, ఇక్కడ కాస్త మంచి టిఫినూ, కాఫీ దొరుకుతాయి.

సీతాపతి లేచాడు. 'రండి చయనులూ! కాస్త కాఫీ తాగివొద్దాం' అని పిలిచాడు. అతనితోపాటు అతని పిల్లలిద్దరూ బిలబిలమని బయలుదేరారు. కాంటీను దగ్గరకి



వెళ్ళి కాఫీలకు ఆర్డరిచ్చి నిల్చున్నాం.

'మీకు భుజంగం గుర్తున్నాడుకదూ ?' అడిగేడు సీతాపతి.

'మీ ఐదో ప్రాణం గురించి మీకు తెలుసా?' అనడగలేదు సీతాపతి.

కాని అలాగ—అంతకంటే కూడ క్రూరంగానే అడిగినట్టయింది. నా మనసు విల విలలాడి పోయింది. సీతాపతి యిలా మారిపోయాడేం? హైస్కూలు చదువుకీ – భిలాయ్ కంపెనీలో అతనికి లభించిన పెద్ద ఉద్యోగానికీ మధ్య కనిపించని అంత అగాధం ఉందా?! హైస్కూలులోని మా స్నేహాన్ని అతనేమీ సీరియస్‌గా తీసుకోలేదా? అది అతని మనసు మీద ఎలాంటి ప్రభావాన్నీ కలిగించలేక పోయిందా?

'భలేవారు! భుజంగంగాడు తెలీకపోవడమేమిటి?' అన్నాను నొక్కిపట్టి.

బలమైన బాంబు, సీతాపతి గుండెకి గురిమాసి విసిరేననుకున్నాను. ఆ బాంబు అతన్ని అణుమాత్రం చలింప చేయలేదు.

నిబ్బరంగా అన్నాడు 'అతనొక ఇడియట్'

కాఫీ చప్పరిస్తూ త్రుళ్ళిపడ్డాను. నా అదురుపాటుని కప్పిపుచ్చుకోవటానికని, 'ఏమోయ్— ఇందులో షుగర్ ఇంత తక్కువ వేసావేమిటి?' అంటూ మరోస్పూను పంచదార వేయించుకున్నాను, కాఫీ పానకంలాగా అధ్వాన్నంగా తయారయింది. అప్పటికి కొంచెం స్థిమితపడి. అతను చెప్పబోయేది వినటానికి సిద్ధపడ్తూ చూసాను.

'ఇద్దరం కలిసి అనకాపల్లిలోనే చదివాం. మీకు గుర్తేకదూ? హైస్కూలులోలాగ 'ఒరే' అంటే 'ఒరే' అని పిల్చుకుంటే కాలేజీలో ఏం బాగుంటుంది చెప్పండి? నాలుగయిదు సార్లు గట్టిగానే మందలించేను వినడే!— నాకు అసహ్యం వేసింది. సభ్యతలేని మనుషులతో స్నేహమేమిటి లెండి...'

సీతాపతి ఏదో చెప్తున్నాడు.

నా ఒంటిమీద – తేళ్ళో, జెర్రెలో ప్రాకుతున్నట్టనిపించింది.

సభ్యతట! సభ్యత! సీతాపతి మాటలు వినటానికే అసహ్యం అనిపిస్తోంది. ఇంజను పెట్టెలనుంచి వేరయినట్టుంది. ఆ కుదుపుకి రైలుపెట్టెలు కొంచెం కదిలాయి. 'రైలు వెళ్ళిపోతోంది నాన్నా!' అంటూ అరిచేరు సీతాపతి పిల్లలు గాభరాగా, 'ఫరవాలేదు ... ఇంకా వుంటుందర్రా' అని వాళ్ళకి సర్ది చెప్పాను.

సీతాపతి ఇంకా చెప్తున్నాడు. "అప్పట్లో ఒకసారి మా క్లాస్‌మేటు ఒక అమ్మాయితో మాట్లాడుతూ వుంటే – 'వెధవా – ఇక్కడట్రా వుండేది? నీకోసం ఎంతని వెదకను!' అంటూ అరుస్తూ వచ్చేడు. నాకు మండిపోయింది. అమ్మాయిల ఎదుటనయినా కాస్త మర్యాద పాటించవద్దూ? 'వెధవా' అనో, 'ఏరా' అనో పిల్చుకున్నంత మాత్రాన గొప్ప స్నేహం అయిపోతుందా చెప్పండి? అతనలా పిలుస్తూవుంటే నాకు తల కొట్టేసినట్టయింది— ఆ తరువాత అలా పిలవొద్దని గట్టిగా కాషన్ యిచ్చేను.

వినలేదు. నా కాషన్ ఈజీగా తీసుకున్నాడు. అలాంటి మనిషితో నేను మాత్రం ఎందుకు ఫ్రెండ్‌షిప్ చెయ్యాలి చెప్పండి? ఓ నమస్కారం పెట్టేసి అతన్ని పలకరించటం మానేసాను. అసలింతకీ – తనకే నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చిందని అతనికా గర్వం తెలుసా అండీ?"

తేలిపోయేడు మనిషి.

ఇదీ సీతాపతి అసలు స్వరూపం. భుజంగరావు తనకు స్కాలర్‌షిప్ వచ్చిందని, వ్రాస్తూ సీతాపతికి రాకపోవటం తనకి చాలా బాధ కలిగించిందంటూ వ్రాసిన ఉత్తరంలోని ముక్కలు నాకింకా గుర్తున్నాయి. మనసంతా చికాగ్గా తయారయింది. కాఫీలు ముగించి మళ్ళీ కంపార్టుమెంటువేపు దారి తీసాము. పాన్‌వాలా తోపుడు బండితో ఎదురయితే బిస్కెట్ పాకెట్‌కొని సీతాపతి కొడుకు చేతిలో పెట్టాను.

'ఎందుకండి అనవసరంగా యివన్ని' అని నవ్వేసి, సీతాపతి మళ్ళీ తన సంభాషణని కంటిన్యూ చేసాడు. 'అతని పెళ్ళికి మీరంతా వెళ్ళారు... అప్పట్లో ఏదో అత్యవసరమయిన పనిమీద హైదరాబాద్ వెళ్ళవలసి రావటంతో నేను రాలేకపోయాను – కదూ?'

'మరే' తలూపాను.

'నిజానికి ఆ పెళ్ళి తప్పించుకోవాలనే నేనా క్యాంప్ పెట్టుకున్నాను భుజంగరావు మీకు చెప్పలేదూ?'

భుజంగరావు సీతాపతి కాదుగదా అలాంటి విషయాలు చెప్పి తేలిక పడిపోవటానికి! అడ్డంగా తలూపేను; అసహనంగా ఎదురు తిరుగుతున్న గుండెను అదిమి పట్టుకుంటూ.


'కారణం మరేమీ లేదు – నేనిందాక చెప్పానే – ఓ అమ్మాయి ఎదుట నన్ను ఫూల్ చేస్తూ వాగేడని – ఆమే సుజాత భుజంగం ఆమెనే పెళ్ళి చేసుకున్నాడు—' సీతాపతి ముఖంలో ఉద్రేకం స్పష్టంగా కనిపిస్తోంది. రచయితగా నాకున్న వరమల్లా మనుషుల్ని చదవటం.

చూచి చూచి అడిగేను 'మీరు సుజాతను ప్రేమించారా?' సీతాపతి మొఖం ఒక్కసారి వెలిగింది. అంతలోనే ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగా తయారయింది.

'ఆమె నన్ను గాఢంగా ప్రేమించింది' అన్నాడు మెలికపెట్టి.

ఈ మనిషి మాటల్లోనే యిన్ని మెలికలున్నాయి. ఇంక మనసులో ఎన్ని వంకరలో?


గంట కొట్టారు. బండి కదలబోతూంది. పిల్లల్ని ఎక్కించి గబగబ రైలెక్కాము.



40 సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును
వివరములకు: రిజిస్టర్డు రావ్ అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ నయబస్ డిపో ఎదుట,
బాలాజీలాడ్జింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.
ఆఫీస్‌ఫోన్: 42870, ఇంటిఫోన్: 38544

ఉ చి త ము
మా జూబ్లీ ఉత్సవ సందర్భముగా 1976–77 సంవత్సరపు రెండు మడతలుగల వివిధ రంగులతో అందమైన కేలండర్ ఉచిత బహుమతిగా ఇవ్వబడును. స్వంత అడ్రసు మరియు 55 పైసల స్టాంపులు ఈ క్రింది అడ్రసుకు పంపవలెను.
V. MOHAN, P. Box 7002,
Delhi-110002

అజీర్ణం
వల్ల మీరు
భయపడుతున్నారా?
హ్యూలెట్స్
మిక్స్చర్
తీసుకొని -
తిరిగి తినడం
ప్రారంభించండి




సి. జె. హ్యూలెట్ & సన్
(ఇండియా) ప్రైవేట్
లిమిటెడ్
మద్రాసు 600 002,
కలకత్తా 700 001
SAA/CJH/1191


# స్నేహమేరా జీవితం....

ఇంక సీతాపతితో మాట్లాడటానికి నాకేమీ మిగల్లేదనిపించింది.

సీటులో కూర్చున్నాక — ఓడ్ హౌస్ నవల 'ది స్మాల్ బేచ్‌లర్' తీసాను, నా విముఖత స్పష్టపడేలా. ఏమనుకున్నాడో సీతాపతి కూడా మరేమీ మాట్లాడలేదు. అంతవరకూ వాళ్ళావిడ చదివి పడేసిన సినిమా పత్రిక అందుకుని పేజీలు తిరగెయ్యటం మొదలు పెట్టాడు.

నాకు నవలమీద దృష్టి నిలవలేదు. అతని గురించే ఆలోచిస్తున్నాను. మనసంతా చికాగ్గా తయారయ్యింది. భుజంగం — గోవర్ధనం — రామం — వాళ్ళు కూడా ఇలాగే తయారయి వుంటారా? ఊహూఁ! ఒక్కనాటికీ కాదు...అలాగే అయితే తనీ లోకంలో ఈజన్మకి మంచి స్నేహితుల్ని పొందగలడా?

గుడ్డి బిచ్చగాడు మళ్ళీ అదే పాట ఎత్తుకున్నాడు. వాడు మా పెట్టె వదలినట్టు లేదు. సాధారణంగా ఇలాంటి గుడ్డివాళ్ళకి వెనక తోడుగా ఎవరో ఒకరుంటారు. వీడు పాపం, ఆ అదృష్టానికీ కూడా నోచుకున్నట్టు లేదు.

వాడు పాట పాడేతీరు అంత బాగుండక పోయినా, ఆ పాటలోని భావం మనసుని కదలించేసేది కావటంవలన కాబోలు కళ్ళు పుస్తకం మీద వుంచినా వాడి పాటనే వింటూ ఆలోచిస్తూ కూర్చున్నాను. కంపార్టుమెంటులో జనం బాగానే వున్నారు. అంతా ఎవరి సంభాషణలో వాళ్ళున్నారు.

పాట ముగిసింది. డబ్బులు అడుక్కుంటున్నాడు. దగ్గరదివాళ్ళు యివ్వాళ్ళనుకుంటూ మళ్ళీ పుస్తకంలోకి మునిగిపోయాను.

ఇంతలో — మాది లింక్ కంపార్టుమెంటు కావటం మూలంగా అవతలి పెట్టెలోనుంచి మరో బిచ్చగాడు ఏదో పాడుకుంటూ వచ్చేడు. తలెత్తి చూసాను. రద్దీగా వుండటంచేత మనిషి సరిగా కనిపించటంలేదు. కాని స్వరం బాగుంది. వీడికంటే చక్కగా పాడుతున్నాడు. ఆ పాట వింటూ, పుస్తకం మూసి కిటికీలో నుంచి బయటకు చూస్తూ కూర్చున్నాను. పచ్చని పంటచేను కళ్ళకి మనోహరంగా కనిపిస్తోంది. ఆకాశంలో తెల్లని మబ్బులు ముక్కలు ముక్కలుగా అందంగా వున్నాయి. చల్లనిగాలి వీస్తోంది.

'ఎవులదీ...సి వాసెలమ్మా!'

అంతవరకూ మా కంపార్టుమెంటులో పాట పాడిన బిచ్చగాడి గొంతు వినిపించింది. ఎవర్నో గొంతు వినే గుర్తుపట్టినట్టున్నాడు ఎంత చిత్రం!

'నేను...నేనేరా సింహాసెలాన్ని నువ్వు ...'

'నేన్రా గనేసాన్ని...'

వాడి గొంతులో ఆశ్చర్యం, ఆనందం అవధులు దాటి స్ఫురిస్తోంది. 'అబ్బ! ... ఎంత సిత్రం ... మళ్ళా మనం కలుస్తామనుకున్నాంరా?'

రైల్లో ఇంతమంది వున్నారు. వాళ్ళతో సంబంధం లేనట్టుగా మాట్లాడేసుకుంటున్నారు. వేరే వ్యాపకం ఏదీలేదు కనుక ఓ చెవి అటు పడేసాను.

'అంతా ఆ సింహాద్రప్పన్న దయురా సింహాసెలం ... ఇంతకీ నువ్వు పారిపోనావేట్రా, మమ్మల్నొగ్గేసి...ఇంతకాలం ఎక్కడున్నావురా ఎదవా!' ఆ గొంతులో అంతులేని ఆత్మీయత.

'ఏటి సెప్పమన్నావు గనేసూ! ఆయేల నీ కొడుకుని యీ ఎదెవ పాపిష్టి చేతుల్తో ఎవలకో అప్పసెప్పేసినానా— సూత్తూండమని సెప్పేసి మరీ ఆదెమ్మతో గవర్నమెంటు అస్పత్రికి మందు కోసం ఎల్లాను...ఇంతలో వార్సం బాదేసినాది — సత్రంలో ఓ మూల కూకున్నాను — గుడ్డిముండా కొండుకుని — ఎవులో వచ్చేరా గనేసం — పిక్కిరోడు ఏడుస్తుంటే—'ఎదవ ... గుడ్డెదవా! గుంటడు సుక్కపట్టి 'ఏడుస్తుంటే ఏటలా వాళ్ళో ఎట్టుకుక్కొకున్నావు, లే!' అనడిగిరి—అల్లెవరో - ఏటో—తెలుసుకోకుండానే యిచ్చేసినాను —సింహాద్రప్పన్న సాచ్చికంగా నాకేటి తెల్దురా గనేసం—ఈ గుడ్డోడ్నికూడా అంత అన్నేయం సేసేసే ఎదవలు—వచ్చినెత్తుర్ను తాగేవోల్లుంటారని తెలవదురా నాకు—తరునాత తెలిసింది — అల్లలాగే సత్రంలో మరో ముగ్గురు గుంటల్ని తీసికెలిపోనారని నేను బయంతో వణికిపోయేనా. నువ్వొచ్చి అడిగితే ఏటని సెప్పడం? పేణం గిలగిలలాడిపోనాది. నాకేటీ తోచనేదు. అందుకే పారిపోనాను. ఎన్నివూళ్ళు తిరిగానో గుడ్డోడ్ని ఒక్కడ్ని. ఏ యమ్మ దయసూసినా ఆ పూట గడిసిపోద్ది. నన్ను నమ్మురా గనేసూ. నా నేటి తెలిసి అన్నేయం సెయ్యనేదురా.' వలవల ఏడుస్తున్నాడు వాడు.

ఆసక్తికరమయిన ఈ దృశ్యం చూస్తూ అంతా వుండిపోయేరు. వాళ్ళ సంభాషణ నన్ను కదిల్చివేస్తోంది. ప్రపంచం ఎంత విచిత్రమయినది! కటిక దరిద్రుడ్ని మొదలు కోటీశ్వరుడి వరకూ ఎవర్ని కదిపినా ఎన్ని

కథలు ? మరెన్ని వ్యథలు !

'వూరుకోరా సింవాసెలం — వూరుకో — ఏటలా సిన్నపిల్లాడిలా ఏడుస్తావు. సింవాసెలం కొండమీద తిరణాలకి మనం జత కలిసిందగ్గర్నుంచీ నీ మనసెట్టాంటిదో తెల్దురానాకు ? నీదేటి తప్పనేదు కదరా! మా కరమం అలా వుండబట్టే జరిగింది. మమ్మల్ని ఒగ్గేసి నువ్వెలిపోయాక—నా కంతా తెరిసిందిరా — ఏటిసేస్తాం ? నువ్వు ఎలిపోనావని నేనూ ఆదెమ్మా అనుకోని రోజు నేదంటే నమ్ము—' అని ఓదారుస్తున్నాడు గణేశం.

'మరిసిపోనాను...అక్కెలావుంది?' చప్పున అడిగేడు సింహాచలం.

గణేశం గొంతులో వేదన ధ్వనించింది: 'ఇంకెక్కడి ఆదిరా సింవాసెలం—అది నన్ను అన్యాయంచేసి పోనాది—ఆ సావు గుడ్డిదవని నాకైనా వొచ్చినాది కాదు — కనిపెట్టుకునుండేది-అది పోనాక నాకు సెయ్యి యిరిగిపోనట్టయిపోనాది—'

'హోరి దేవుడా! అక్కపోనాదా!' దాదాపు గొల్లుమన్నట్టుగానే అన్నాడు గణేశం. ఆ వేదనలో నిజాయితీ. ఆ దుఃఖంలో అభిమానం నన్ను విచలింపచేస్తున్నాయి.

'ఏమిటీ న్యూసెన్స్' విసుక్కుపోతున్నాడు సీతాపతి. పెట్టెలోవున్న వాళ్లలో కొందరు వాళ్ల సంభాషణను జాలిగానూ, కొందరు విసుగ్గానూ, మరి కొందరు వినోదంగానూ వింటున్నారు. మొత్తంమీద అందరిదృష్టి వాళ్లమీదే వుందని చెప్పాలి.

వాళ్లిద్దరూ ఒకర్నొకరు వోదార్చుకున్నారు. 'వూరుకోరా గనేశం—అయిపోయింది అయిపోనాది—ఇకనుంచి నీకు నేనూ, నాకు నువ్వూ తోడుగా వుందాం కద ? కట్టంలో సుకంలో కలిసుందాం—సింవాద్రప్పన్న మన కింత కూడు దొర్కేటట్టు సెయ్యక పోడు' ధైర్యం చెప్పాడు సింహాచలం.

వాళ్ల భయాలతోగాని, విశ్వాసాలతోగాని నిమిత్తం లేకుండా రైలు వేగంగా దూసుకుపోతూనే ఉంది.

* * *

విజయనగరం దీపాల్లో వెలిగిపోతోంది.

రైలు దిగేను.

సీతాపతి ఇంకా వాల్తేరు వరకూ వెళ్లాలి.

సీతాపతి రైలుదిగి వచ్చేడు. ఇద్దరం రైలు తిరిగి కదిలే వరకు బుక్‌స్టాలు దగ్గర గడిపేం — నాకు మాత్రం వింత వేగంగా వదుల్చుకుని యిల్లు చేర్దామా అని ఉంది. చిరాకుని సాధ్యమయినంత కన్పించనివ్వకుండా ప్రయత్నం చేసాను. గంట కొట్టేరు. అతనూ నేనూ కంపార్టుమెంటు దగ్గరకి వెళ్ళాం. సీతాపతి రైలెక్కాడు. సీతాపతి పిల్లలు 'అంకుల్ టాటా' అంట్టూ చెయ్యి వూపుతున్నారు.

నవ్వుతూ వాళ్లకి చెయ్యివూపుతున్నానే కాని, నాదృష్టి అంతా ఆగుడ్డివాళ్ల మీదే ఉంది. నా చెవులకి ఇంకా వాళ్లమాటలు వినిపిస్తున్నట్టే ఉంది.

రైలు కదలబోతున్నది.

అంతవరకూ మానేసి — మళ్ళా ఏం ఆలోచించుకున్నారో — ఆ బిచ్చగాళ్లిద్దరూ అప్పుడు ఫ్లాట్ ఫారంకి అవతలివేపుకి దిగబోతున్నారు. అరె! ఇంతసేపూ ఎందుకు వూరుకున్నారు! గాభరాగా అరిచాను. 'వద్దు రైలు కదుల్తోంది, జాగ్రత్త !' అని. అప్పటికే ఒకడు దిగేశాడు. అతడు రాళ్లమీద కాలువేసి జారిపడటం జనం మధ్యనుంచి అస్పష్టంగా కనిపించింది. నాగుండె నెవరో కుదిపి వేసినట్లయింది. గాభరాగా చూస్తున్నాను. రెండోవాడు కూడా దిగేశాడు. జనం రద్దీలో అవతల ఏం జరిగిందో కూడా కనిపించలేదు. కంపార్టుమెంటులోని వాళ్ళు కూడా 'భద్రంరా బాబూ!' అంటూ మందలించటం — వాళ్ళు దిగిపోవటం — అంతా అనుకోకుండానే త్రుటికాలంలో జరిగిపోయింది.

'అరె! పాపం...' నాగొంతులోని తీవ్రత నాకే స్పష్టంగా తెలుస్తోంది. కదుల్తున్న రైలుతోటే రెండడుగులు వేసాను.

'ఫరవాలేదు చయనులుగారూ! వాళ్లకేం కాదులెండి — అలాంటి వాళ్లకే అసలు ఆయుర్దాయం హెచ్చుగా వుంటుంది ! — ఒకవేళవాళ్ళు చచ్చినా ఏం నష్టం ? కాస్త భూభారమయినా తగ్గుతుంది' జోక్ చేసినట్టుగా నవ్వుతున్నాడు సీతాపతి. నాగుండె గుబగుబ లాడింది.

నాకు లోపల బనియను చెమట్లతో తడిసిపోతున్నది. నాతో పాటే మరికొందరు కూడా కళ్ళు వప్పగించి చూస్తూ వుండిపోయేరు.

రైలు వేగాన్ని అందుకుంది.

నాగుండె వేగాన్ని పుంజుకుంది.

'ఏం జరగకూడదు భగవాన్ !'


* * *

రైలు పూర్తిగా విడుటనుంచి వెళ్లిపోయేక — చప్పున ఆత్రతగా పట్టాలవేపు చూసేను.

అవతలి వేపు దృశ్యాన్ని చూసి, తృప్తిగా గుండెనిండా గాలి పీల్చుకున్నాను. గుడ్‌గాడ్! వాళ్ళకేం ప్రమాదం జరగలేదు !

ఆ ముష్టి వాళ్ళిద్దరూ ఒకరి భుజం మీద ఒకరి చెయ్యి వేసుకుని నిబ్బరంగా వెళ్ళిపోతూ అల్లంత దూరంలో కనిపించేరు. నాగుండె మీదనుంచి ఏదో గొప్ప బరువు తీసేసి నట్లనిపించింది. తృప్తిగా నిట్టూర్చాను.

'స్నేహమేరా జీవితం...' వాడి పాటయింకా నాచెవుల్లో గింగుర్లు తిరుగుతూనే ఉంది!




"మీ కార్టూన్లు వాళ్లకి నచ్చలేదేమో...అందుకే తిప్పి పంపారు...అమాత్రందానికే మీరింతగా బాధపడిపోవాలా !!"
"మరైతే ఇవే కార్టూన్లని రెండు సంవత్సరాల క్రితం ఎవరో వేస్తే ఎలా ప్రచురించుకున్నారు ?"